


వీరబ్రహ్మం కండ్లజోడు తీసి ప్రక్క జేబులో వుంచుకుని రెండడుగులు ముందుకు వేసి గోడ మధ్యనుండే కిటికీలోనుండి బైటికి చూచినాడు. అప్పటికి చాలా సేపటి నుండి పుస్తకం చదువుతూ వుండడంతో కండ్లు కొద్దిగా మంటలు పెట్టాయి. కొద్దిసేపు పుస్తకాన్ని బల్ల మీద వుంచి, శరీరానికి విశ్రాంతినిస్తూ బయటికి చూస్తూంటే ఏదో ఒక విధమైన హాయి అనిపిస్తూంది.

మిద్దె మెట్లు దిగి క్రిందికి పోదామా అని అనుకొని కూడా, వెంటనే ఆ ప్రయత్నమూ మానుకొన్నారు. క్రిందికి వెళ్ళి మళ్ళీ శ్రీమతితో పోట్లాడడమూ ఆయనకు ఇష్టముగా లేదు. ఆమెతో కాస్త కటువుగా మాట్లాడి, మేడమీదికి వచ్చిన తరువాత మళ్ళీ తన పంతం దిగజారిపోయినట్లుగా క్రిందికి వెళ్ళడమూ తనబోటి వాడికి పరువుతక్కువేమోననిపించింది. ఏరీతినైనా తను ఈ పూట భోజనం మానేసి అయినా సరే ఇక్కడే ఈ మేడమీదనే కూర్చోవలెనని నిర్ధారించుకున్నాడు మనసులో.

వీరబ్రహ్మం భార్యతో పోట్లాట పెట్టుకున్నప్పుడల్లా కొంచెంసేపు మూతి ముడుచుకుని మేడమీద గదిలో కూర్చోవటం పాత రివాజే. ఆవిడ భోజనానికి రమ్మని పిలవడం, కాస్సేపు తను రాననడం, తనకు ఆకలి లేదనడం, ఆవిడ బ్రతిమాలిన తరువాత వెళ్ళి నోరు మూసుకుని ఒక్క మాటా పలుకూ లేకుండా నిశ్శబ్దంగా భోజనం పూర్తిచేసి రావడం మామూలుగా జరుగుతుండే వ్యవహారం.

భోజనానికి పోయినప్పుడు భార్య పలుకరిస్తే ఒకటి రెండు మాటలు తప్ప మాట్లాడేవాడు కాదు. వంటవాడు ఆ దృశ్యం చూచి, తనలో తాను నవ్వుకుంటే ఆయనకు ఒళ్ళు మండేది. అయినా పైకి మాత్రం ఏమీ అనేవాడు కాదు. ఈ రోజు ఉదయం తను కాఫీ తాగడానికి క్రిందికి వెళ్ళనే లేదు. మేడమీదనే ముఖ ప్రక్షాళనం చేసి, వంట వాడు తీసుకుని వచ్చిన కాఫీ త్రాగాడు. తను ముభావంగా, కోపంగా వున్నానని తన భార్య గ్రహించాలనేందుకే ఆయన ఈ తాపత్రయమంతా!

నౌకరు ఆయన గడ్డము చేసుకొనడానికి వేడినీరు, క్షురకర్మ పరికరాలను తీసికొని వచ్చి ఆయన దగ్గర పెట్టి పోయినాడు. ఆయన ఉద్యోగము చేస్తున్న రోజు లలో ఆదివారంనాడు ఓపిక వుంటే గడ్డం గీసుకునే వాడు. లేక బద్ధకిస్తే ఊరుకునేవాడు. అప్పటికీ భార్య "చూడండీ! మీరు గడ్డం చేసుకొనకపోతే ఎంత అసహ్యంగా కనబడుతున్నారో" అంటుండేది. ఆమె మాటలకు తాను కూడా నవ్వుతూ గడ్డం గీసుకునేందుకు ఉపక్రమించేవాడు. ఇప్పుడు ఆమెకు తన సంగతి పట్టదు. ఇప్పుడు తాను ఎట్లా వున్నా పట్టించుకోదు.

వీరబ్రహ్మం మళ్ళీ పుస్తకం తీసుకుని చదవడానికి ప్రయత్నించినాడు. కాని చదవబుద్ధి కాలేదు. తీసుకున్న పుస్తకం బల్లమీద పడవేశాడు. తన భార్య యిప్పుడేమి చేస్తున్నదో! నౌకరును అడిగి కనుక్కుందామనుకున్నాడు. కాని సూటిగా ఆ ప్రశ్న అడగలేక "ముందు గది ఊడిచినావా?" అన్నాడు.

"లేదండీ! అమ్మగారికోసరం ఎవరో వచ్చినారు. అందుకని ఊడవడం లేదు" అన్నాడు నౌకరు.

"ఎవరూ రాకముందే, పొద్దున్నే నువ్వు గది ఊడ్చి వుండవలసింది" అన్నాడు కోపంతో.

నౌకరు సమాధానంగా ఏదో గొణిగాడు. ఒక్క క్షణం ఆగిన తర్వాత "అమ్మాయి గది ఊడ్చావా?" అని అడిగినాడు.

"ఊడ్చానండీ! అమ్మాయిగారు స్నానానికి వెళ్ళినపుడు గది శుభ్రం చేసినాను. ఆవిడ కారులో ఎవరో స్నేహితునితో బయటికి వెళ్ళారు" అన్నాడు నౌకరు.

అమ్మాయి ఎవరితోనో వెళ్ళిందనడంలో వాడు వ్యంగ్యం చూపడం లేదు కదా? తాను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో నౌకర్లు హద్దు మీరి ప్రవర్తించడమునే మాత్రం సహించేవాడు కాదు. వాళ్ళలో ఏమాత్రం క్రమశిక్షణ లోపించినా, వెంటనే తగిన చర్య తీసుకొనేవాడు. తన భార్య పనిమనిషితో లోకాభిరామాయణం కబుర్లు చెప్పుకొంటూ కూర్చోవడం తనకు బాధకలిగించేది. ఒకటి రెండు సార్లు వాళ్ళకు ఆ రీతిగా చనువు ఇవ్వవద్దని తను మందలించాడు కూడా. అయినా ఆమె తన మాటలు లెక్క చేయకుండా తన కాలక్షేపం కొనసాగిస్తూనే వుంది. తన భార్య అరవిందతో ఈ విషయం ఒకసారి అంటే-

"మీరు తీరికగా ఇంట్లో కూర్చుని ఏమీ తోచక వాళ్ళమీద విసుక్కుంటున్నారు" అన్నది.

"వంటవాడు గిన్నెల మీద మూతలు సరిగ్గా పెట్టడం లేదు" అన్నాడు.

"పోనీండీ! అంతలోనే మీ ఆరోగ్యం ఏమీ చెడిపోదులెండి" అన్నది భార్య తేలికగా.

"నౌకరు మనతోబాటు టీ తాగడం నాకేమీ బాగాలేదు" అన్నాడు ఒకతూరి ఊరుకోలేక.

"మీరు ప్రతిదానికీ ఇలా విసుక్కోవడం బాగుందా? వాళ్ళు టీ తాగినంత మాత్రాన వచ్చిన నష్టమేమిటి?"

"మీరు ఇంట్లో దుబారా చేస్తూంటే చూస్తూ ఊరుకోమంటారా?" అని అన్నాడు తను.

"చాల్లేండి! అంతకంతకూ పిసినిగొట్టు లయిపోతున్నారు మరీనూ" అన్నది నవ్వుతూనే.

వీరబ్రహ్మం ఇక మాట్లాడలేక ఊరుకున్నారు. భార్య దృష్టిలో పిసినిగొట్టు కావడం ఇష్టం కాక సంభాషణను అంతటితో ఆపివేశాడు. తనకు ఇంటిలో జరుగుతున్న ప్రతి విషయం దేనికి? నాకెందుకని పట్టించుకోకుండా వూరకుండకూడదూ? తన భార్య అన్నట్టుగా తీరికగా ఇంట్లో కూర్చుంటే మనస్సుకు వెర్రి ఆలోచనలు కలగడం లేదుకదా! ఏమో . మనస్సు ప్రతి విషయమునూ సూక్ష్మంగా పరిశీలించి, బాధకు దోహదం చేస్తున్న దేమిటి? అయితే కావచ్చు. భార్య, కుమార్తె తనమాట లక్ష్యం చేయడం లేదని ఒక బాధ నౌకర్లు విచ్చలవిడిగా తిరుగుతున్నారని మరొక బాధ!

తన భార్య అరవింద మహిళా మండలి అధ్యక్షురాలు. ఆవిడను కలుసుకొనడానికి తరచు కొందరు వ్యక్తులు తమ యింటికి వస్తూ వుంటారు. ఆమె ఏవో మీటింగులు వున్నాయంటూ తరచూ బయటకు వెళుతూ వుంటుంది. ఆమె ప్రవర్తన ఎందుకో ఇప్పుడు బాధ వేస్తూంది. ఇదే తను ఉద్యోగం చేస్తున్న రోజులలో ఆమె నలుగురిలో గౌరవం పొందుతున్నందుకు ఎంతో సంతోషించేవాడు.

కూతురు ప్రేమకు కాలేజీ చదువుతో ఒక్క క్షణం కుదరదు. ఆమె కాలేజీ చర్చలలోనూ నాటకాలలోనూ పాల్గొంటూ వుంటుంది. ఆమె తెలివితేటలకు తను ఎంతో గర్విస్తున్నాడు. కానీ ఈమధ్య ఎందువల్లనో ప్రేమ కాలేజీలో ఆ రీతిగా తిరగడం బాధ కలిగిస్తోంది. ఒకసారి అరవిందతో "అమ్మాయి అలా తిరగడం బాగులేద"ని అంటే "చాల్లేండి! చదువుతోపాటు అమ్మాయికి కాస్త వినోదం కూడా కావాలి. ఎప్పుడూ చదువూ సంధ్యలేనా?" అన్నది.

"ఎప్పుడూ మీటింగులంటూ తిరగకపోతే కనీసం నువ్వయినా నా ఎదుట వుండకూడదూ? అన్నాడు ఊరుకోలేక.

23-2-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



డాక్టర్ టి.ఆర్. కృష్ణన్

"ఇదా మీ బాధ! మీ ఎదురుగా వచ్చి కూర్చొని నేమా, అదీ భజన చేయలేదని మీకు బెంగగా వున్నదా...చాల్లేండి. ఎవ్వరన్నా వింటే నవ్విపోతారు. నేను మీటింగులకు వెళ్ళడం కానీ, అమ్మాయి కాలేజీకి వెళ్ళడంకానీ ఎట్లా మానుకోగలము? మీరు ఉద్యోగం చేస్తున్న రోజులలో నౌకర్లు వంగి వంగి సలాములు పెట్టినట్లుగా మేము కూడా వుండాలంటే నా వల్ల కాదు" అన్నది ఎంతో విసుగ్గా.

"మిమ్మల్ని సలాం పెట్టమనడం లేదు. నాకండ్ల ఎదుట వుండమంటున్నాను. అంతే! మీకు ఇష్టమైతే నా మాట వినండి. లేకపోతే లేదు" అన్నాడు కోపంగా.

"మీరు బొత్తిగా పసిపిల్లాడయిపోతున్నారండీ! చిన్న పిల్లవాడు తల్లి కనుపించకపోతే తల్లడిల్లినట్లున్నది మీ ధోరణి" అన్నది అరవింద.

బహుశః ఆమె అన్నది నిజమేనేమో! తన ఎదురుగా భార్యా కూతురు కూర్చొని కబుర్లు చెప్పలేదని బాధ పడటం అవివేకమేమో? తనతో కబుర్లు చెప్పడానికి వాళ్ళకు ఎలా తీరుతుంది? దాని గురించి బాధ పడడం అర్థం లేదు. ప్రతి విషయాన్నీ మనస్సుకు పట్టించుకుని గంటల తరబడి ఆలోచించడం కూడా అవివేకమే.

తను ఉద్యోగం చేస్తున్న రోజులలో ఆఫీసు విషయాలు చికాకు కలిగిస్తే సిగరెట్ కాల్చుకుంటూ వాటిని మరచిపోవడానికి ప్రయత్నించేవాడు. ఆ రోజులలో ఎప్పుడు ఉద్యోగ విరమణ అవుతుందా, హాయిగా విశ్రాంతిగా ఎప్పుడు వుంటామా అని కలలు కనేవాడు. అవొక రోజులు. ఆ రోజులలో భవిష్యత్తు ఒక సుందర దృశ్యంగా గోచరించేది. ఎన్నో తీయని కలలు కనేవారు. ఉద్యోగ విరమణ అయిన తరువాత ఇంటిపట్టున వుండి, హాయిగా కాలక్షేపం చేద్దామనుకొనేవారు. యాంత్రికంగా వుండే జీవితం నుంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందా అని అనుకొనేవారు. తన తోటి ఉద్యోగస్తులు విరమణ అయిన తర్వాత ఇంకా పొడిగింపుగాని, మరొకచోట ఉద్యోగం కోసం కాని ఎందుకు ప్రయత్నించేవారో ఆ రోజులలో అర్థం అయ్యేది కాదు. ఇప్పుడు పూర్తిగా అర్థమవుతోంది.

తను ప్రశాంతంగా జీవితం గడుపుదామంటే చేత కావడం లేదు. ఎప్పుడూ ఏదో చిక్కులు కలిగిస్తున్నవి. ఆర్థిక బాధలు తనకేమీ లేవు. ప్రావిడెంటు ఫండు డబ్బులు వస్తూనే వున్నాయి. పైగా త్వరలో తను ఇన్నాళ్ళూ కట్టిన భీమా బాపతు సొమ్ము రాబోతున్నది. ఇవికాక తనకు కొన్ని కంపెనీలలో వాటాలు వుండంవల్ల లాభాలు సంపాదిస్తున్నారు. ఇక డబ్బుకు ఇబ్బంది పడవలసిన అగత్యం ఏముంది?

తన కుమార్తె అందంగా వుంటుంది. సంగీతంలో ప్రావీణ్యం గలది. ఆమె వివాహం చెయ్యడం తనకొక సమస్య ఏమీ కాదు. ఇక తను దేనికోసమూ దిగులు పడవలసిన అవసరమే కనిపించదు.

అయినా తన మనస్సుకు ఎప్పుడూ ఏమిటో చిరాకుగా వుంటూనే వుంటున్నది. తను ఊహించినంత ప్రశాంతంగా, సంతోషంగా జీవితం గడవడం లేదు. తన భార్యతో ఒకసారి "మన గ్రామం వెళ్ళి అక్కడ వుందామా" అన్నాడు.

అంతే ఆమె "ఆ అడవిలో నేనెక్కడ వుండగలను?" అన్నది నవ్వుతూనే.

కూతురు తల్లికి వంతపాట పాడుతూ "ఇంకా నయం, సహారా ఎడారిలో వెళ్ళి వుందామనలేదు. ఇక్కడ కాలేజీ చదువు వదులుకొని రమ్మంటావేమిటి నాన్నా?" అన్నది. గొల్లుమని నవ్వుతూ. వాళ్ళకు నవ్వులాగానే వుంటుంది, కానీ తన బాధ వారికి ఏమాత్రం అర్థం కాదు.

"అది కాదమ్మా! మన ఊళ్ళోనూ కాలేజీ వుందిగా! అక్కడ చదువుకోవచ్చు" అన్నాడు.

"చచ్చు కాలేజీ అది. అందులో చదివినా ఒకటే, చదవక పోయినా ఒకటే. ఇక్కడ లెక్చరర్స్ అక్కడి కంటే చాలా బాగా చెప్తారు నాన్నా!" అన్నది ప్రేమ.

"రిటైరు అయిన దగ్గిరి నుంచి మీకు పిచ్చి ముదిరిపోతున్నదే! ఈ ఊళ్లో వున్న స్నేహితులనూ, బంధువులనూ విడిచి దూరంగా వెళ్ళిపోతామంటారేమిటి?" అన్నది భార్యామణి అరవింద.

ఉద్యోగరీత్యా తనకు స్నేహితులున్నారుకానీ, ఇప్పుడు ఉద్యోగ విరమణానంతరం ఎవరూ లేరని అరవిందకు చెబుదామనుకున్నాడు. ఎందుకో మళ్ళీ చెప్పబుద్ధి కాలేదు. "ఈ ఊళ్ళో ఇల్లు కొనాలంటే చాలా డబ్బు అవుతుంది" అన్నాడు.

"అయితే మాత్రం ఏమిటి? కొంత భాగము బాడుగకు ఇస్తే ఆ డబ్బు కొంత వరకు తిరిగి రాబట్టుకోవచ్చు కదా!" అన్నది భార్య ఒక ఉచిత సలహా సరఫరా చేస్తూ.

ఆ సలహా తనకు నచ్చక ఊరికి కొంచెము పెడగా వున్న ఇల్లు కొన్నాడు. బాడుగకు ఇవ్వడము ఇష్టం లేక భార్య సలహా పాటించలేదు. ఇల్లు సౌకర్యంగానే వున్నది. సొంత ఇల్లు అనే భావం మనస్సుకు తృప్తి కలిగిస్తున్నది. అయినా అంతరాంతరాల్లో ఏదో అశాంతి, అసంతృప్తి ఇంకా పీడిస్తున్నవి. గందరగోళంగా వుండే ఈ ప్రదేశం నుండి దూరంగా పారిపోయి స్వగ్రామంలో హాయిగా, ప్రశాంతంగా కాలం గడుపుదామని తోస్తున్నది. చిన్నప్పుడు గడిపిన ప్రదేశాలను జ్ఞాపకం తెచ్చుకుంటే రెక్కలు కట్టుకుని అక్కడికి పారిపోదామని తహతహ కలుగుతోంది.

ఎందువల్లనో ఈ ఇంట్లో తనకు చికాకుగా వుంటోంది. తను ఊహించినట్లుగా ఈ వృద్ధాప్య జీవితం గడిచిపోయేట్టు లేదు. ఉద్యోగం చేస్తున్న రోజులలో విశ్రాంతిగా ఇంటి పట్టున ఎప్పుడెప్పుడుందామా అని కలలు కనేవాడు. ఇప్పుడు ఏకాంతం భరించలేక పోతున్నాడు. ఏమీ తోచక ఇంట్లో ఇటూ అటూ తిరిగితే ఇల్లు చిందర వందరగా వుండడం, వంటవాడు వంటింట్లోనే బీడీలు, సిగరెట్లు కాల్చడం వంటివి చూసి అసహ్యించుకోవలసి వస్తుంది.

ఇలా వీరబ్రహ్మంగారు ఆలోచనలలో నిమగ్నమయి వుండగా వాకిట్లో కారు ఆగిన చప్పుడు వినిపించింది. ఆయన లేచి ఆ కారు ఎవరిదా అని చూచినాడు. వెంటనే గుర్తుపట్టినాడు. "ఆ వెధవ వచ్చినట్టున్నాడు" అని తనలోతనే గొణుక్కున్నాడు. ఆ వెధవను తన కూతురు ప్రేమ ప్రేమించింది. ఆ అబ్బాయికిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందని ఆమె తల్లి సలహా ఇచ్చింది.

ప్రేమ కారులో వెళుతుంటే చూచి బాగా కోపంగా "ఎక్కడికి వెళుతున్నావు?" అని అరిచినాడు. కోపం నిగ్రహించుకొనేందుకు ప్రయత్నం చేసినా ఆయన వల్లకాలేదు.

"నా మాటంటే ఎవరికీ లెక్కలేదు" అని భార్య అరవింద మీద విసుక్కున్నాడు. "అడ్డమైన ప్రతి వెధవతోను అమ్మాయి తిరగడం యేమీ బాగాలేదు."

ఆయన మాటలు బిగ్గరగా వినిపించినాయి. బజారులో పోతున్నవారు ఈ మాటలు వింటే బాగుండదని ఆయనకు అప్పుడు అనిపించలేదు. ప్రేమ స్వేచ్ఛగా తిరగడం ఆయనకు బాధ కలిగిన మాట మాత్రం వాస్తవం.

"ఆయన మాటల కేమిలేమ్మా! ఆయనకు మనస్థిమితం లేక మాట్లాడుతున్నాడు. నువ్వు వెళ్ళమ్మా!" అని కూతురు ప్రేమను పంపించింది అరవింద.

తనంటే ఇంట్లో ఎవరికీ లెక్కలేదని విసుక్కుంటూ వీరబ్రహ్మం మళ్ళీ మేడమీద తన గదిలోకి వెళ్ళిపోయినాడు. ఈ వృద్ధాప్యంలో ఇలా కాలం గడపడం కంటే హాయిగా సన్యాసులలో కలిసి, నిత్యమూ భగవంతుని ప్రార్థిస్తూ సంసార తాపత్రయం లేకుండా నిశ్చింతగా ఎక్కడికో దూరంగా పారిపోవడం మంచిదనిపించింది ఆయనకు ఆ క్షణంలో. కానీ...పారిపోతే? అసలు పారిపోగలడా?